
సాక్షి ఒడిశా

బుధవారం । 4 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,45,655లు, బంగారం 100 మిల్లీగ్రాములు, వెండి 77 గ్రాములు 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఈ నగరానికి ఏమైంది..?

బరంపురంలో డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. దోమల వ్యాప్తే ఇందుకు కారణమని చెబుతున్నారు.

- 8లో



రైతులకు వ్యతిరేక 'కేంద్రం'

కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని వివిధ సంఘాల నాయకులు మండిపడ్డారు.

- 8లో

న్యూస్‌రీల్

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: మునిసిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి కోరారు. మంగళవారం 1వ వార్డు, 2వ వార్డు, 17వ వార్డుల్లో నిర్మించిన కమ్యూనిటీ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నరేంద్రకుమార్ మహంతి, కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, వార్డు కౌన్సిలర్లు గోపీనాథ్ మహంతి, అజిత్ బెహర, సిమాంచల బెహరా, సత్య నాయక్, శంకర ప్రహరాజ్, గంగాధర సాహు, నరశింహ నాయిక్, రాజీవ టక్రి, బలియ పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వ్రతాలకు సన్నాహాలు

భువనేశ్వర్: కార్తీక వ్రతం కోసం సన్నాహాలు ఊపందుకున్నాయి. పూరీలో బస చేసి నెల రోజుల పాటు నిరవధికంగా ఈ వ్రతం ఆచరించే వారి కోసం అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. కార్తీక మాసం నెల పొడవునా నిర్వహించే వ్రతంలో పాల్గొనదలిచే వారు పేరు, ఇతర వివరాలు నమోదు చేసుకునే ప్రక్రియను ప్రారంభించింది. ఔత్సాహిక భక్తులు https://edistrict.odisha.gov.in వెబ్‌సైట్ లింక్ లో వివరాలు నమోదు చేసుకోవాలి. వివరాలకు జిల్లా సాంస్కృతిక అధికారి 9692720594, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి 9437302618, జిల్లా క్రీడల అధికారి 9437 30268, జిల్లా కార్యాలయం 06752-22264 నంబర్లను సంప్రదించవచ్చు. ఆఫ్‌లైన్‌లో కలెక్టర్ కార్యాలయంలో కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. నరేంద్ర కోణొ ప్రాంతం, బృందావతి నివాసం, బొగొలా, బగాడియా ధర్మశాల, అక్షయ పాత్ర, మోచీ సాహి కూడలి కల్యాణ మండపంలో వ్రత ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ఏడాది 3,000 మందికి పైగా భక్తులకు వసతి, మహాప్రసాదం, శ్రీమందిర దర్శనం, అల్పాహారం ఇతర వసతి సౌకర్యాలు కల్పించనున్నారు.

పది మంది జూదరుల అరెస్టు



పట్టుబడిన నగదు

బరంపురం : నగరంలోని సోమనాథనగర అపార్ట్‌మెంట్ రోడ్డులో శిథిలావస్థకు చేరిన ఓ ఇంట్లో జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పది మందిని అరెస్టు చేసి రూ.78 వేల నగదు, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఐఐసీ అధికారి సుమిత్ సరన్ తెలిపారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం అందజేస్తున్న వైస్ చైర్‌పర్సన్ బి.సునీత

జయపురం: ముఖ్యమంత్రి పరిధాన యోజనలో భాగంగా తెలుగు సాంస్కృతిక సమితి వారి జయపురం సిటీ హైస్కూలులో 9, 10వ తరగతులకు చెందిన 144 మంది విద్యార్థులకు మంగళవారం యూనిఫాం, షూ, సాక్సులు అందజేశారు. జయపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బి.సునీత చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. హెచ్‌ఎం బి.సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, సభ్యులు శశి పట్నాయక్, దుర్గాశర్మ, పి.శ్రీనివాసరాజు, ఎం.విజయ, ఆర్.లోకేశ్వరి, భార్గవి ఆచారి, సీహెచ్ రమ్య, టి.పైడమ్మ, పి.శివప్రసాద్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, ఉపాధ్యాయులు ప్రతాప్‌కుమార్ పట్నాయక్, కె.పద్మ, రీతా సామంతరాయ్, బి.ధర్మారావు, మౌళి పాల్గొన్నారు.

రాగల 24 గంటల్లో..!



గోపాల్‌పూర్ తీరంలో పడవలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న మత్స్యకారులు





గోపాల్‌పూర్ పోర్టులో అల్లకల్లోలంగా సముద్రం, (ఇన్‌సెట్లో) ఉత్తర-పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బలపడిన అల్ప పీడనం

- బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం
- వాయుగుండంగా మారే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరిక
- 12 జిల్లాలకు వర్షసూచన

బరంపురం :

ఉత్తర-పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశముందని ఇండియన్ మెటరాలాజికల్ డిపార్ట్‌మెంట్ (ఐఎండీ) అధికారులు ప్రకటించారు. ఇది ఏ క్షణాన్నైనా తుఫాన్‌గా మారవచ్చని పేర్కొన్నారు. మంగళవారం గోపాల్‌పూర్ తీరానికి 500 నాటికల్ మైల్స్ దూరంలో ఇది కేంద్రీకతమై ఉందని ప్రకటించారు. మరింత బలపడి వాయుగుండం మారనుందని తెలిపారు. దీని ప్రభావంతో దక్షిణ ఒడిశా తీర ప్రాంతమైన గంజాం జిల్లాతో పాటు గజపతి, రాయగడ, నవరంగపూర్, కొరాపూట్, కొంధమాల్, నువపడా, కలాహండితో పాటు 12 జిల్లాల్లో రాగల 48 గంటల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించారు. ముఖ్యంగా ఆంధ్ర-ఒడిశా తీరం వెంబడి తీవ్ర తుపానుగా మారే అవకాశమున్నట్లు భువనేశ్వర్ వాతావరణ అధ్యాయన కేంద్రం సంచారలడు ఉమామహేశ్వర్ పాత్రో తెలిపారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున చేపల వేటకు మత్స్యకారులు వెళ్లరాదని అధికారులు సూచించారు. గోపాల్‌పూర్ తీరంలో 3వ నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఉపరితలంలో విపరీతంగా కురుస్తున్న వానల కారణంగా సముద్ర నీటిమట్టం పెరిగి అల్లకల్లోలంగా మారింది. ఈ నేపథ్యంలో బోట్లు, వలలు, తొట్టెలు, తెడ్డులను రక్షించుకునే పనిలో మత్స్యకారులు నిమగ్నమయ్యారు.



వర్షం కురుస్తున్న దృశ్యం



వివరాలు వెల్లడిస్తున్న వాతావరణ అధ్యయన కేంద్ర సంచాలకుడు ఉమామహేశ్వర్ పాత్రో

ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల నిర్వహణకు కమిటీ

జయపురం: జిల్లా కేంద్రం జయపురంలో ఈ నెల 15, 16వ తేదీల్లో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటీయూసీ) రాష్ట్ర మహాసభలు విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కొరాపుట్ జిల్లా ఏఐటీయూసీ ప్రతినిధులు కోరారు. మంగళవారం జయపురం కార్మిక భగణంలో కార్మిక నేత జుధిష్టర్ రౌళో అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల నిర్వహణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. దీనికి జుధిష్టర్ రౌళోను అధ్యక్షునిగా, సాధారణ కార్యదర్శి, కోశాధికారిగా ప్రమోద్‌కుమార్ మహంతి, సంఘటన కార్యదర్శిగా ఉత్తమ మల్లిక్‌లను నియమించారు. రాయగడ, మల్కనగిరి, నవరంగపూర్ జిల్లాల నాయకులను కమిటీ సభ్యులుగా చేర్చారు. ఈ నెల 15న ఉదయం 10 గంటలకు కొత్త బస్టాండ్ సమీపంలో లక్ష్మీపండా కూడలి నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పండా, రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ దాస్, ఉపాధ్యక్షుడు, కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి అభయ సాహు, రాష్ట్ర సాధారణ కార్యదర్శి బిజయ జెనా, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ఆశిష్ కనుం తదితరులు పాల్గొంటారని తెలిపారు.



సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఏఐటీయూసీ నేతలు

క్యాన్సర్ ఆస్పత్రికి భూమిపూజ

- నైజర్ క్యాంపస్‌లో రూ.650 కోట్లతో నిర్మాణం
- డిసెంబర్ 2025 నాటికి పూర్తి చేసేలా పనులు
- నకల సౌకర్యాలు కల్పిస్తాం: సీఎం నవీన్



జట్నీ నైజర్ ప్రాంగణంలో భూమిపూజ శిలా ఫలకం ఆవిష్కరించిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ఖుర్దా జిల్లా జట్నీ (ఖుర్దా రోడ్) నైజర్ క్యాంపస్‌లో హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ నిర్మాణ పనులకు మంగళవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నైజర్ సంస్థ అడ్మినిస్ట్రేటివ్ విభాగమైన డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డీఏఈ), టాటా స్టీల్ ఫౌండేషన్‌తో పాటు టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ) జాయింట్ వెంచర్ కింద రూ.650 కోట్ల వ్యయంతో నిర్మాణం కొనసాగుతుంది. ఈ ప్రాజెక్ట్‌కు జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా వర్చువల్ విధానంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఏడాది మేలో శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. సమగ్ర వ్యయ ప్రణాళికలో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.400 కోట్లు, టాటా స్టీల్ ఫౌండేషన్ వాటా రూ.250 కోట్లు. 65.8 ఎకరాల స్థలంలో 200 పడకల క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తారు. అత్యాధునిక సదుపాయాలు, పరిశోధనా కేంద్రాన్ని డిసెంబరు 2025 నాటికి పూర్తిస్థాయిలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు. 2022 సెప్టెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ముంబైలోని టాటా మెమోరియల్ సెంటర్‌తో ఈ ఆస్పత్రి నిర్మాణానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. క్యాన్సర్ పరిశోధనలకు కేంద్రంగానూ ఉంటుంది. క్యాన్సర్ చికిత్స, నివారణలో ఆవిష్కరణలు, పురోగతి కార్యకలాపాల్ని ప్రోత్సహిస్తుంది.

రాష్ట్ర ప్రజలకు ఉపశమనం..

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నవీన్ మాట్లాడుతూ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే క్యాన్సర్ చికిత్సలో ఒడిశా ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఇకపై ముంబై, ఇతర పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని చెప్పారు. రోగుల ఆర్థిక, మానసిక ఇబ్బందుల నుంచి చాలా వరకు ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. జార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ వంటి పొరుగు రాష్ట్రాల క్యాన్సర్ రోగులకు కూడా ప్రయోజనకరం ఉంటుందని తెలిపారు. విశాలమైన రహదారులు, మో బస్ ద్వారా నేరుగా రవాణా సౌకర్యం, అత్యున్నత శ్రేణి బస్ స్టాప్‌లు, ప్రత్యేక అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. ఒడిశాలోని రోగులకు ఉచిత ఆరోగ్య సంరక్షణను అందించేందుకు ఉద్దేశించిన బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన (బీఎస్‌కేవై)లో ఈ సంస్థని జోడిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి ఆరోగ్య సంరక్షణ సంస్థల్లో 94 లక్షల కుటుంబాలకు బీఎస్‌కేవై ఉచిత ఆరోగ్య సంరక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రి సముదాయంలో ఆహార కేంద్రం ఏర్పాటు కూడా చేయనున్నట్లు సీఎం ప్రకటించారు.

ఆరోగ్య విద్యకు పెద్దపీట

ఆరోగ్య సంరక్షణ రంగంలో ఒడిశా భారీ పరివర్తన చూస్తోందని సీఎం ఉద్ఘాటించారు. ఆరోగ్య విద్యకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. క్రమం తప్పకుండా వైద్యుల నియామకాలు చేపడుతూ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఏటా కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు అవుతుండడంతో శిక్షణ పొందిన వైద్యులు అనుక్షణం అందుబాటులో ఉంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు.

ఆసియాలోనే అతి పెద్ద పరిశోధన కేంద్రం..

నైజర్ క్యాంపస్‌లో హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ సముదాయంలో మెడికల్ సైక్లోట్రాన్ సదుపాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం 65 ఎకరాల భూమిని ఉచితంగా కేటాయించిందని సీఎం తెలిపారు. ఇందుకు రూ.150 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. ఇది ఆసియాలోనే అత్యంత అధునాతన రీసెర్చ్ లెవల్ సైక్లోట్రాన్ అవుతుందని ప్రకటించారు. క్యాన్సరు నివారణకు ముందస్తు గుర్తింపు, సకాలంలో సముచిత చికిత్స, వైద్యసేవలపై సామాన్య జనానికి అవగాహన కల్పిస్తారు. ఈ నేపథ్యంలో ఖుర్దా జిల్లాలో స్క్రీనింగ్, చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నిరంజన్ పూజారి, జట్నీ ఎమ్మెల్యే సురేష్‌కుమార్ రౌత్రాయ్, అణు ఇంధన శాఖ కార్యదర్శి అజిత్ మహంతి, టాటా స్టీల్ ఫౌండేషన్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎం నవీన్ పట్నాయక్

దొంగలు దొరికారు



పోలీసులకు చిక్కిన దోపిడీ దొంగలు వీరే

- నలుగురు దోపిడీ దొంగలను అరెస్టు చేసిన పోలీసులు
- 2.728 కిలోల బంగారం, 26 లక్షల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదు



ప్రశంసలు అందుకున్న పోలీసులతో బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్

బరంపురం : ఇటీవల దోపిడీకి పాల్పడిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి బరంపురం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సార్వణ్ వివేక్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. బరంపురం జిల్లా నిమ్మఖండి పోలీసు స్టేషన్ పరిధిలోని లుచ్చాపడా రోడ్డులో బిజయ విహార్‌లో నివాసముంటున్న కాలుచరణ పండా ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 21న భువనేశ్వర్ వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా దోపిడీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నీలచల్‌నగర్‌కు చెందిన సోనియా గౌడో, లక్ష్మి నారాయణవీధికి చెందిన మోహన్ పాఢి, చిన్నబజార్‌కు చెందిన సంతోష్ గైక్వాడ్, పాత బరంపురానికి చెందిన సురేంద్ర మహాపాత్రోలను నిందితులుగా గుర్తించారు. వీరందరినీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 2 కిలోల 728 గ్రాముల బంగారం బంగారు ఆభరణాలు, రూ.26 లక్షల 58 వేల 500 నగదు స్వాధీనం చేసుకున్నారు.



తెలియా భోలా.. ధర అదిరేలా..

జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్ మత్స్యకారులకు అదృష్టం కలిసివచ్చింది. సోమవారం రాత్రి వేటకు వెళ్లిన వారికి 110 కిలోల బరువున్న 'తెలియా భోలా' చిక్కింది. మంగళవారం ఉదయం వేలం వేయగా చేపకు రూ.25 వేల ధర పలికింది. మందులు, సౌందర్య ఉత్పత్తుల తయారీలో ఈ చేప ఉపయోగపడుతుందని స్థానిక మత్స్యకారులు తెలిపారు.

- భువనేశ్వర్

క్లుప్తంగా

ఘనంగా శిశు మహోత్సవం



వక్తృత్వ పోటీలో పాల్గొన్న విద్యార్థిని

పర్లాకిమిడి: విద్యార్థుల్లో ప్రతిభ వెలికి తీసేందుకు శిశు మహోత్సవం దోహదపడుతుందని మున్సిపల్ క్లస్టర్ ఆర్‌సీసీ ఎం.ఉమాపతి అన్నారు. పర్లాకిమిడిలోని గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం శిశు మహోత్సవం-23 నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని 15 ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, మహరాజా బాలుర ఉన్నత విద్యాలయం విద్యార్థులకు వక్తృత్వ, పాటలు, డ్యాన్స్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎస్.తిరుపతి, పూర్ణచంద్ర ప్రధాన్, మనోజిని పాత్రో, ఆర్.లక్ష్మీపట్నాయక్, నబకుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సేవా భవన్‌లో మంటలు



పొగలు కమ్మిన దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్ర సచివాలయం లోక్ సేవా భవన్‌లో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఉదయం 10 గంటల సమయంలో భవనం మొదటి అంతస్తులో రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ నుంచి దట్టమైన పొగలు వ్యాపించాయి. మంటలను ఆర్పేందుకు నాలుగు అగ్నిమాపక యంత్రాలను రంగంలోకి దింపారు. ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని, అందులో కొన్ని ఫైళ్లు దెబ్బతిన్నాయని అధికారులు చెబుతున్నారు.

అక్రమ కలప స్వాధీనం



కిడిగాం వద్ద దుంగలతో పట్టుబడిన డ్రైవరు

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి కిడిగాం గ్రామం నుంచి అక్రమంగా రవాణా అవుతున్న టేకు, ఖంబారీ దుంగలను వంశధార అటవీ రేంజ్ అధికారులు పట్టుకున్నట్టు కాశీనగర్ పోలీసు ఐఐసీ గోవింద గౌడో తెలిపారు. ఆంధ్రా రిజిస్ట్రేషన్ కలిగిన వ్యాను, డ్రైవరును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కాశీనగర్ ఫారెస్టు అధికారులు నిందితున్ని కోర్టుకు తరలించారు.

విశాఖ- గుణుపురం, రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌లు రద్దు

పర్లాకిమిడి: నౌపడా - పర్లాకిమిడి రైల్వే ట్రాక్ పవర్ బ్లాక్, ట్రాఫిక్ నేపథ్యంలో విశాఖపట్నం - గుణుపురం స్పెషల్ ప్యాసింజర్, గుణుపురం - విశాఖపట్నం ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 4, 8, 11, 15, 18, 22, 25 తేదీల్లో రద్దు చేస్తున్నట్టు వాల్తేరు సీనియర్ డివిజన్ కమర్షియల్ మేనేజరు ఎ.కె.త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ 18117 రూర్కెలా-గుణుపురం రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ 17, 21, 24, 28, 31 తేదీల్లో పలాస వరకే రాకపోకలు సాగిస్తుందని, పర్లాకిమిడి, గుణుపురం స్టేషన్లకు వెళ్లదని పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థినుల భోజనాన్ని పరిశీలిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల సమన్వయాధికారి బాలాజీ

పాతపట్నం: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయాధికారి ఎన్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలేంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో డార్మిటరీ, భోజన శాల, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని, పదో తరగతి, ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు రావాలన్నారు. విద్యార్థులకు ఆంగ్లంపై పలు పశ్నలు వేసి, జవాబులు రాబట్టారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాలు పరిశీలించారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ ఆర్‌వీ కృష్ణతార, కంచిలి ప్రిన్సిపాల్ బి.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ వి.అర్చన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ నగరానికి ఏమైంది..?



చెత్తకుప్పలతో కంపుకొడుతున్న కార్పొరేషన్ రోడ్



ప్రాణాంతక దోమ

- బరంపురంలో విజంభిస్తున్న డెంగీ
- పెరుగుతున్న దోమల వ్యాప్తి
- పరిశుభ్రత లేని కాలువలు
- వర్షాలు కురుస్తున్న కానరాని పారిశుద్ధ్య చర్యలు

బరంపురం: ఓవైపు డెంగీ జ్వరాలు.. మరోవైపు పరిశుభ్రత లేని కాలువలు.. ఇంకోవైపు ఎడతెరిపి లేని వానలు.. ఇంత జరుగుతున్నా అధికారులు సరైన దృష్టి సారించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కొద్ది రోజులుగా బరంపురం నగరంలో డెంగీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. రోగులంతా ఎంకేసీజీ మెడికల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు రోజుల క్రితం అంకులి నుంచి ఓ మహిళ జ్వరంతో బాధపడుతూ ఎంకేసీజీ ఆస్పత్రిలో చేర్పగా రక్త పరీక్షల్లో డెంగీగా తేలినట్లు జిల్లా మలేరియా అధికారి ఉమాశంకర్ మిశ్రా తెలిపారు. జ్వరపీడితులతో పాటు తలనొప్పి, కాళ్లు చేతుల నొప్పులతో ఎక్కువ మంది ఆస్పత్రుల్లో చేరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పూడికలతో నిండిన కాలువలు..

నగర మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగర పరిధిలోని కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి ఎక్కడ చూసినా రోడ్లపై మురుగునీరే దర్శనమిస్తోంది. ఎక్కడికక్కడ చెత్తకుప్పలు, మురుగునీటి నిల్వలే కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని పలు ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.



ఎంకేసీజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డెంగీ జ్వరపీడితులు

ఫెరోమాన్స్‌తో పంటకు రక్షణ



తోటగుమ్మాదలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: క్రిమికీటకాల నుంచి పంటలను రక్షించుకోవడానికి ఫెరోమాన్స్ ఉచ్చులు దోహదపడతాయని సెంచూరియన్ వర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు అన్నారు. గుసాని సమితి తోటగుమ్మడ గ్రామంలో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. పురుగులు, క్రిమికీటకాలు నుంచి పంటలను రక్షించుకోవడానికి రైతులు ఎక్కువగా రసాయనాలను పిచికారీ చేస్తున్నారని, అలాకాకుండా ఫెరోమాన్స్ ఉచ్చులు వాడితే సులభంగా నివారించవచ్చని పేర్కొన్నారు. సాగులో యాజమాన్య, యంత్ర పద్ధతులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు బి.వరుణ్, కె.సుభాష్, కె.యశ్వంత్, బి.నిఖిల్ పాల్గొన్నారు.



ఫెరోమాన్స్ ఉచ్చులు బిగుస్తున్న సెంచూరియన్ వ్యవసాయ విద్యార్థులు

రైతులకు వ్యతిరేకంగా 'కేంద్రం'



జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగిన సంఘాల నాయకులు

పర్లాకిమిడి: ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని లక్ష్మీపూర్ ఖేరీలో రైతులను వాహనంతో ఢీకొట్టినన ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా అక్టోబరు 3ను 'నల్లదినం'గా అభివర్ణిస్తూ గజపతి జిల్లా పర్లాకిమిడిలో అఖిల భారత కిసాన్ మజ్దూర్‌సభ, ఒడిశా కృషక్ సభ, రైతుకూలీ సభ, ఇతర సంఘాల నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీగా వెళ్లి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు వ్యతిరేకంగా ఉన్న మూడు చట్టాలు ఉపసంహరించుకున్నా, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారని అఖిల భారత కృషక్ మజ్దూర్ సభ జాతీయ కార్యదర్శి బాలచంద్ర షడంగి కలెక్టరేట్ దుయ్యబట్టారు. లక్ష్మీపూర్ ఖేరీ ఘటనకు బాధ్యులైన మంత్రి అజయ్ మిశ్రాను ఇంతవరకూ అరెస్టు చేయకపోవడం తగదన్నారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను అఖిల భారత కృషక్ మజ్దూర్ సభ నాయకులు ఖండించారు. రైతుల అన్ని రుణాలు మాఫీ చేయాలని, పంటకు కనీస మద్దతు ధర, 60 ఏళ్ళు గడిచిన రైతు కూలీలకు నెలకు ఐదువేల పెన్షన్, రైతులపై పెట్టిన అన్ని కేసులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కృషక్ నేత, ఒడిషా కృషక్ సభ జిల్లా అధ్యక్షుడు దండపాణి రయితో, రైతు కూలీ సభ అధ్యక్షుడు రొక్కం లోకనాథం, ఏఐకేఎంఎస్ నేత శ్రీనివాస బెహరా, జిల్లా కమిటీ సభ్యులు సోంబారి రయితో, దళిత అధికార నాయకులు బానీప్రసాద్ మాలి, ఆదివాసీ నేత కుకుడా శోబోరో, గంగాబడ సర్పంచ్ హరిబంధు కార్జి తదితరులు పాల్గొన్నారు.

రజతాలంకరణ

ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణి దుర్గమ్మను మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. దసరా ఉత్సవాలు రానున్న నేపథ్యంలో ఆలయానికి భక్తుల రాక పెరుగుతోంది. దీంతో మంగళవారం అమ్మను వెండి ఆభరణాలు, పూలమాలలతో అలంకరించారు.

– ఎల్‌ఎన్ పేట



గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ



రూ.10 వేల చెక్ అందజేస్తున్న కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రామ ముఖి పరిపాలన, ప్రజావినతుల స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో పర్లాకిమిడి పురపాలక సంఘ పరిధిలో కాకుండా, కత్తుల కవిటి, కెరండి, రాణీపేట సిద్ధమణుగు పంచాయతీల నుంచి 49 వినతులు అందాయి. వాటిలో 42 వ్యక్తిగతం కాగా, 7 వివిధ గ్రామసమస్యలపై వచ్చాయి. ముగ్గురికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.40వేల సాయం అందించారు. ఒకరికి రెడ్ క్రాస్ నిధి నుంచి రూ.వేలను కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డీఎఫ్‌ఓ. ఆనంద్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ కలెక్టర్ బిరేంద్రకుమార్ దాస్, గ్రీవెన్స్ నోడల్ అధికారి నర్మదా దోళాయి, తహసీల్దారు నారాయణ బెహరా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ప్రెస్‌క్లబ్ వినతి

జిల్లాలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామీణ, పట్టణ విలేకరులందరికీ అక్రిడిటేషన్ కార్డులు, స్వస్థ్య యోజన, విశ్రాంత విలేకరులకు పెన్షన్ ఇతర సౌకర్యాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గజపతి జిల్లా ఉత్కళ సంబాదిక్ సంఘ్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బిధాన్ చౌదురి, ద్విజేంద్రనాథ్ పాఢి, ప్రదీప్‌కుమార్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత



సీజ్ చేసిన లారీలు

నరసన్నపేట: జాతీయ రహదారిపై రెండు లారీల్లో అక్రమంగా 60 పశువులు తరలిస్తున్న వారిని నరసన్నపేట పోలీసులు మడపాం టోల్ గేట్ వద్ద అడ్డుకున్నారు. వీటిని ఒడిశా రాష్ట్రం గంజాం నుంచి రాజమండ్రికి కొందరు తరలిస్తున్నారు. ముందస్తు సమాచారంతో టోల్‌గేట్ వద్ద నరసన్నపేట ఎస్ఐ వై.సింహాచలంతో పాటు సివిల్ వస్త్రాలతో ఉన్న కొందరు పోలీసులు కాపు కాసి పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశామని, రెండు వాహనాలను సీజ్ చేశామని, ఆవులను విశాఖలోని గోశాలకు తరలించామని ఎస్ఐ తెలిపారు. అక్రమంగా పశువులను తరలించవద్దని ఎస్ఐ సూచించారు.

ఇంటిపై పిడుగుపాటు

బూర్జ: మండలంలో గల గంగంపేట గ్రామంలో పిడుగు పడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మంగళవారం సాయంత్రం గ్రామంలో ఉరుములు మెరుపులతో వర్షం పడింది. ఈ వర్షానికి గ్రామానికి చెందిన పీస పెంటయ్య శ్లాబ్ ఇంటిపై పిడుగు పడడంతో శ్లాబ్ కొంతమేర బీటలు వారింది. ఇంటిలో ఉన్న ఎలక్ట్రికల్ సామాన్లు, విద్యుత్ మీటరు, ఫ్రిజ్, టీవీ పూర్తిగా ధ్వంసమయ్యాయి.

గాల్లో ప్రాణాలు!



నది వంతెనపై వేలాడుతున్న బస్సు

భువనేశ్వర్: ఓ వైపు ఉద్ధృతంగా ప్రవహిస్తున్న మహా నది. మరోవైపు నది వంతెనపై ప్రయాణికులతో వెళ్తున్న బస్సు. ఏమైందో గానీ ఒక్కసారిగా బస్సు అదుపుతప్పి కాంక్రీట్ రెయిలింగ్‌ను ఢీకొట్టింది. బస్సు ముందుభాగం గాల్లో తేలింది. దీంతో ప్రయాణికులు హాహాకారాలు చేశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక, స్థానిక ప్రభుత్వ అధికారులు, పోలీసు బృందం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సురక్షితంగా బస్సును యథాస్థితికి తీసుకొచ్చారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. కటక్ జిల్లా బంకీ ప్రాంతం మహా నది వంతెనపై మంగళ వారం ఈ ఘటన చోటుచేసుకుంది. భువనేశ్వర్ వైపు వెళ్తున్న ఈ బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదంలో 10 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది. సాంకేతిక లోపం ప్రమాదానికి దారితీసి ఉంటుందని, ఈ విషయమై డ్రైవర్‌ను ప్రశ్నిస్తామని పోలీసు అధికారి తెలిపారు.

డ్రైవరుదే పొరపాటు..

బంకీ మహానది వంతెనపై బస్సు ప్రమాదం ఘటనపై దర్యాప్తు ప్రారంభమైంది. ప్రాంతీయ రవాణా శాఖ ఈ దర్యాప్తు చేపట్టింది. బస్సు ఫిట్‌నెస్, పర్మిట్ వ్యవహారంలో ఎటువంటి లోటు లేదని, డ్రైవరు తప్పిదంతోనే ఈ ప్రమాదం జరిగిందని ప్రాంతీయ రవాణా విభాగం అధికారి సంజయ కుమార్ బెహరా తెలిపారు. దర్యాప్తు పూర్తయ్యాక డ్రైవరుపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముగిసిన శాసనసభ సమావేశాలు

- ఒక రోజు ముందుగానే ముగిసిన వైనం
- శ్రద్ధపై వివరణ ఇచ్చిన సీఎం నవీన్



సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ వర్షాకాల సమావేశాలు షెడ్యూల్ కంటే ఒక రోజు ముందుగా మంగళవారంతో ముగిశాయి. స్పీకర్ ప్రమీలా మల్లిక్ ఆదేశాలతో సభను సైన్-ఎ-డైగా ప్రకటించారు. దీంతో సభా కార్యక్రమాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ప్రమీలా మల్లిక్ కొత్త స్పీకర్‌గా ఎన్నికైన మరుసటి రోజు సెప్టెంబర్ 22న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. అక్టోబర్ 4 వరకు సమావేశాలు కొనసాగుతాయని తొలుత ప్రకటించారు. ఇంతలోనే సమావేశాలకు తెరపడింది. ఈ వ్యవధిలో అదనపు వ్యయ మంజూరి బిల్లుతో 12 బిల్లులు సభా ఆమోదం పొందాయి. రూ.28,200 కోట్ల అనుబంధ బడ్జెట్‌కు సభ ఆమోదించింది. వీటన్నింటిపైనా లోతుగా చర్చించినట్లు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెలిపారు. పలు ప్రజాహిత అంశాలపై సభలో చర్చించినట్లు పేర్కొన్నారు. స్పీకరు, డిప్యూటీ స్పీకరు సభా కార్యకలాపాల్ని దక్షతతో నిర్వహించారని అభినందించారు. ఈ సందర్భంగా విపక్షాలతో సహా ఇతర సభ్యులు, ప్రభుత్వ అధికారులు, ఇతర యంత్రాంగానికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

అసెంబ్లీలో 'శ్రద్ధ'పై సీఎం వివరణ..

వాటికన్ సిటీకి తనతో పాటు వెళ్లిన శ్రద్ధ అనే మహిళపై ప్రతిపక్షాలు వేసిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మంగళవారం సభలో సమాధానం ఇచ్చారు. తన దివంగత సోదరి గీతా మెహతా పంపిన ఫిజియోథెరపిస్ట్ శ్రద్ధ అని స్పష్టం చేశారు. ఆమెకు ఎలాంటి ప్రభుత్వ వసతి, ప్రయాణ ఖర్చులను ఒడిశా ప్రభుత్వం భరించ లేదని పేర్కొన్నారు. సభను ప్రజల ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించుకోవాలని సీఎం సభ్యులకు సూచించారు. గత వారం ప్రతిపక్ష బీజేపీ నాయకులు శ్రద్ధ విషయమై నిలదీసిన నేపథ్యంలో సీఎం వివరణ ఇచ్చారు.

కొత్త స్పీకరు ఎన్నిక..

వర్షా కాలం సమావేశాలు ఆరంభానికి ముందు రోజున కొత్త స్పీకరు ఎన్నిక జరిగింది. తొలి మహిళా స్పీకరుగా ప్రమీలా మల్లిక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఏడాది మే నెల 12న ఇద్దరు మంత్రులు - సమీర్ రంజన్ దాస్ (పాఠశాలలు, సామూహిక విద్య), శ్రీకాంత్ సాహు (కార్మిక), అప్పటి స్పీకర్ బిక్రమ్ కేశరీ అరుఖా తమ పదవులకు రాజీనామా చేయడంతో స్పీకర్ ఎన్నిక అనివార్యమైంది.

విపక్షాల నిరసన..

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రతిపక్షాన్ని ప్రజా వ్యతిరేకులుగా వ్యాఖ్యానించడం పట్ల ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీ సభ్యులు నిరసనకు దిగడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో స్పీకరు మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు సభా కార్యక్రమాల్ని తాత్కాలికంగా వాయిదా వేశారు.

ప్రశ్నోత్తరాలు ప్రారంభమైన కొద్ది నిమిషాలకే బీజేపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ సభ వెల్‌లోకి దూసుకెళ్లారు. సభలో ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలో ప్రయోగించిన 'ప్రజావ్యతిరేక' పదాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. పార్టీ చీఫ్ విప్ మోహన్ చరణ్ మాఝీ, ఎమ్మెల్యే ముఖేష్ మహాలింగ్‌లను అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసేంత వరకు సస్పెండ్ చేయడాన్ని కూడా విపక్ష బీజేపీ సభ్యులు నిరసించారు. సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలనే నినాదాలు చేశారు. మోహన్ చరణ్ మాఝీ, ముఖేష్ మహాలింగ్ గత గురువారం స్పీకర్ పోడియం పైకి పప్పు రువ్వి నిరసన తెలిపినందుకు వారిని సభ నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

బీజేడీ జనసంకల్ప పాదయాత్ర ప్రారంభం



బ్రాహ్మణదేవికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి రబినారాయణ నందో

జయపురం: రాష్ట్రంలో అధికార బీజేపీ మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జయపురం విధాన సభ స్థాయిలో జనసంకల్ప పాదయాత్ర ప్రారంభించింది. సోమవారం మధ్యాహ్నం జయపురం సమితి జాముండ గ్రామం నుంచి ఈ యాత్ర మొదలైంది. ముందుగా మాజీ మంత్రి రబినారాయణ నందో పార్టీ శ్రేణులతో కలిసి జాముండ గ్రామ ప్రజల ఆరాధ్య దేవత బ్రాహ్మణదేవి అమ్మవారికి పూజలు చేశారు. అక్కడి నుంచి దేరి రొండాపల్లి గ్రామ పంచాయితీ సనకావిడీ గ్రామం వరకు ఐదు కిలోమీటర్లు సాగింది. కార్యక్రమంలో మాజీ మంత్రి రబినారాయణ నందో, బీజేడీ మహిళా నాయకురాలు డాక్టర్ ఇందిరా నందో, జిల్లా పరిషత్ సభ్యులు తాపతి పట్నాయక్, అంత నాయిక్, రశ్మి రథ్, జయపురం సమితి అధ్యక్షురాలు తిలోత్తమ నాయిక్, ఉపాధ్యక్షులు గణేష్ ప్రసాద్ పాఢీ, జయపురం మున్సిపాలిటీ ఉపాధ్యక్షురాలు బి.సునీత, జోన్ బీజేడీ అధ్యక్షుడు బాబుల పట్నాయక్, పంచాయతీ అధ్యక్షుడు టున రథ్, పట్టణ అధ్యక్షుడు హరప్రసాద్ మిశ్రా, సీనియర్ నాయకులు బాలా రాయ్, ధన ఖోర, లింగరాజ్ పాత్రో, శివ పట్నాయక్, గాయిత్రీ దేవి తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న మహిళా కార్యకర్తలు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయస్థానం



విజేతలతో వాడాడ హైస్కూల్ హెచ్ఎం సుందర రావు

బాడంగి: మండలంలోని వాడాడ జిల్లాపరిషత్ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగిన అటల్ టింక్లింగ్ పోటీల లో ద్వితీయస్థానం సాధించినట్లు హెచ్ఎం జి. సుందరరావు తెలిపారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జరిగిన పోటీలలో తమ విద్యార్థులు ఎన్.సురేష్ మణికంఠ, బి.భాస్కరరావు, ఎ.రాజమౌళి, జి,యోగేంద్రలు రెండవస్థానంలో నిలిచారని చెప్పారు. వారికి గైడ్‌టీచర్లుగా జి.సురేష్, అటల్‌ఇన్‌స్ట్రక్టర్‌గా ఎం.శ్రీకాంత్ వ్యవహరించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కోచ్‌లను హెచ్ఎంతో పాటు టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు డోలపేట విద్యార్థులు



అండర్-17 క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థితో పీడీలు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-17 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఆర్‌వీజీఎస్ మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. ఇటీవల శ్రీకాకుళంలో నిర్వహించిన పోటీలలో టి.జగదీష్, ఎల్.రాధికలు ఎంపికయ్యారన్నారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. వారి ఎంపిక పట్ల పీడీలు రేణుకాదేవి, సుజాతలతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కరాటేలో రాజాం విద్యార్థుల ప్రతిభ



అండర్-17 క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థితో పీడీలు

రాజాం సిటీ: ఇటీవల విజయనగరంలోని రాజీవ్ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన ఫస్ట్ ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్-2023 పోటీల్లో రాజాం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కోచ్ ఆర్.శివ మంగళవారం తెలిపారు. కుమిటీ విభాగంలో ఎస్.శ్రీకరన్, వి.సూర్యచంద్ర, వి.రిషికలు మొదటి స్థానం సాధించారన్నారు. అలాగే కాటా విభాగంలో ఎస్.వినయ్, జె.లితీష్ ప్రథమస్థానం, చిన్ను ద్వితీయస్థానం, చిన్న, ఎస్.అనీష్‌లు తృతీయ స్థానం సాధించారని తెలిపారు. వీటితోపాటు ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయస్థానం దక్కించుకున్నారని చెప్పారు. వీరి ప్రతిభ పట్ల కోచ్ శివ, అనూరాధ అభినందించారు.

పరజపాడులో ఏనుగుల గుంపు

పార్వతీపురంటౌన్: జియ్యమ్మవలస మండలం పరజపాడు గ్రామం వద్దకు ఏనుగుల గుంపు చేరిందని జిల్లా అటవీశాఖాధికారి జీపీపీ ప్రసూన తెలిపారు. వారం రోజులుగా రామినాయుడు వలస గ్రామం వద్ద ఏనుగులు ఉన్నాయని, అక్కడి నుంచి పరజపాడు గ్రామానికి చేరాయని చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పరజపాడు గ్రామం చుట్టు పక్కల గ్రామాలు నీచవలస, దట్టివలస, లక్ష్మీపురం, కుంతలతిరువాడ, తుమ్మల దందివలస, చింతల బెలగాం, రాజీపేట, పెదమేరంగి, సింగనాపురం, పెదకుదమ, చినకుదమ, పిప్పలభద్ర, ఇటిక, బొమ్మిక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

దుగ్గి ముంపు ప్రాంతాల్లో ఒంటరి ఏనుగు

ఒంటరి ఏనుగు హరి దుగ్గి ముంపు ప్రాంతాల్లో ఉందని పేర్కొంటూ చుట్టుపక్కల గ్రామాలు దుగ్గి, కల్లికోట, గుణానుపురం, అర్తాం, పెదవలస, చినవలస, నిమ్మలపాడు, బాసంగి, వెంకటాపురం, బిత్రపాడు, దళాయిపేట, తొడుమ, మార్కొండపుట్టి, చంద్రంపేట, పరశురాంపురం, గుంప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళల్లో, వేకువ జామున ఆయా ప్రాంతాల ప్రజలు సంచరించ వద్దని హితవు పలికారు. అటవీశాఖాధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ట్రాకర్ల సంఖ్యను పెంచనున్నట్లు తెలిపారు. ఏనుగుల సంచారంపై నిర్దిష్ట సమాచారం ఉంటే అందించాలని కోరారు. రామినాయుడువలసలో పంటనష్టం, ఏనుగుల సమాచారానికి సంబంధించిన వివరాలు బీట్ ఆఫీసర్ ఎం.కిరణ్ కుమార్ ఫోన్, 9440595181 నంబర్, పార్వతీపురం బీట్ ఆఫీసర్ కృష్ణ ఫోన్ 8790418198 నంబర్, ట్రాకర్ చంద్రశేఖర్ ఫోన్ 9398452958నంబర్‌కు తెలియజేయాలని ఆమె వివరించారు.

విద్యుత్ సేవల్లో జవాబుదారీతనం

- ప్రతి సేవకు నిర్దిష్ట సమయం
- గడువులోగా చేయకపోతే అపరాధ రుసుం చెల్లింపు
- వాల్‌పోస్టర్ ద్వారా అవగాహన కల్పిస్తున్న సిబ్బంది
- ఎస్ఓపీ విధానాన్ని తీసుకొచ్చిన విద్యుత్‌శాఖ

సకాలంలో సేవ అందించకపోతే అపరాధ రుసుము వివరాలు	
సమస్య	చెల్లించే రుసుం (రూ.లలో)
ఫ్యూజ్‌ఆఫ్‌కాల్	100
ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి	ఒక్కొక్కరికి 100
మీటర్ సమస్య	రోజుకి 100
కొత్త కనెక్షన్‌కి	ఎల్‌టీరోజుకి 100
కొత్త కనెక్షన్	హెచ్‌టీరోజుకి500
పేరు మార్పు	100
ఫేజ్ మార్పు	రోజుకి 200
రాంగ్‌ఫ్యూజ్ కనెక్షన్‌కు	100



విజయనగరంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్

విజయనగరం ఫోర్ట్: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు సకాలంలో అందించాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశం. వినియోగదారుడికి నిర్దిష్ట సమయంలో సేవలు అందించలేకపోతే విద్యుత్‌పంపిణీ సంస్థ వినియోగదారుడికి అపరాధరుసుం చెల్లించనుంది. ఈ కార్యక్రమంపై వాల్‌పోస్టర్ ద్వారా విస్తృతప్రచారం చేపట్టారు. స్టాండర్డ్ ఆఫ్ ఫెరఫార్మెన్స్ (ఎస్ఓపీ) కార్యక్రమాన్ని ఏపీఈపీడీసీఎల్ చేపట్టింది. జిల్లాలో సుమారు ఏడు లక్షల మంది వినియోగదారులు ఉన్నారు.

విద్యుత్‌శాఖ చేపట్టే సేవలు

విద్యుత్‌శాఖ ద్వారా విద్యుత్ సరఫరా , మీటర్ రీడింగ్, మీటర్ రీడింగ్‌లో సమస్యల పరిష్కారం, కొత్త విద్యుత్ కనెక్షన్ల మంజూరు, ఓల్టేజ్ సమస్య పరిష్కారం వంటి సేవలు అందిస్తారు.

నిర్ణయించిన నిర్దిష్ట సేవల వివరాలు

ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు పట్టణాల్లో అయితే 4 గంటల లోగా, గ్రామీణ ప్రాంతం అయితే 12 గంటలు లోగా పరిష్కరించాలి. ట్రాన్స్‌ఫార్మర్ మార్పు చేయడానికి పట్టణంలో అయితే 24 గంటలు, గ్రామీణ ప్రాంతమైతే 48 గంటల్లో చేయాలి. ఓల్టేజ్ సమస్య పట్టణంలో అయినా గ్రామీణ ప్రాంతం అయినా 10 రోజుల్లో చేయాలి. ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి వస్తే 120 రోజులు, సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సి వస్తే 6 నెలల్లోగా చేయాలి. మీటర్‌లో సమస్య అయితే పట్టణంలో అయితే 7 రోజులు, గ్రామీణ ప్రాంతమైతే 15 రోజుల్లోగా చేయాలి. కేటగిరి మార్పు కోసం పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో 7 రోజుల్లోగా చేయాలి. కొత్త కనెక్షన్ మంజూరు చేయడానికి ఎల్ సర్వీస్ అయితే 7 రోజులు (పట్టణం, గ్రామీణం) హెచ్‌టీ అయితే 15 రోజులు, 33కేవీ అయితే 30 రోజులు, 133 కేవీకి 45రోజుల్లో కనెక్షన్ ఇవ్వాలి.

విద్యుత కనెక్షన్‌ల వివరాలు:	
కేటగిరి	విద్యుత్ కనెక్షన్ల సంఖ్య
కేటగిరి-1	6,41,271
కేటగిరి-2	74,288
కేటగిరి-3	3606
కేటగిరి-4	12,696
హెచ్‌టీ	388
వ్యవసాయం	37,163

సకాలంలో సేవలు



వినియోగదారులకు సకాలంలో సేవలు అందించడం కోసం ఎస్ఓపీ విధానాన్ని తీసుకొచ్చాం. దీనిపై వాల్‌పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. సకాలంలో సేవలు అందించకపోతే వినియోగదారుడికి అపరాధ రుసుం చెల్లిస్తాం.

ముప్పల లక్ష్మణరావు, విద్యుత్‌శాఖ ఎస్.ఈ

రహదారి భద్రతపై శాఖల మధ్య సమన్వయం

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి



హాజరైన వివిధ శాఖల జిల్లా అధికారులు

విజయనగరం అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణలో అన్ని శాఖలు సమన్వయంగా పనిచేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులన్నిటినీ శనివారం లోగా డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. పోలీస్, మెడికల్, హై వే, రవాణాశాఖ లాగిల్‌లో ఉన్న కేసులను సమన్వయంతో పరిష్కరించాలని చెప్పారు. ప్రమాదాల నివారణకు ఓవర్‌లోడింగ్, డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్ వాడకం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు విద్యాసంస్థల్లో యువతకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇకపై ప్రతి నెలలో మొదటి శుక్రవారం రోడ్ సేఫ్టీ సమావేశం జరుగుతుందని వచ్చే సమావేశానికి అన్ని శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలు తీసుకుని రావాలని స్పష్టం చేశారు. సమావేశంలో రవాణాశాఖ ఉప కమిషనర్ రవీంద్రనాథ్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములునాయుడు, ట్రాఫిక్ పోలీస్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలి

- బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు



నవోదయ ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న చైర్మన్ కేసలి అప్పారావు

శృంగవరపుకోట: విద్యాలయాల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, నైతిక విలువలు పెంపొందించాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని కిల్తంపాలెం పంచాయతీలో గల జవహర్ నవోదయ విద్యాలయలో హర్యానా విద్యార్థులపై వ్యాయామ ఉపాధ్యాయుడు శారీరక దండనకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు హర్యానా కలెక్టర్ సమాచారంతో జిల్లా సిబ్బందితో కలిసి మంగళవారం ఆయన నవోదయ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా హర్యానా విద్యార్థులను ఆరా తీశారు. పాఠశాల ఆవరణ, పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో సౌకర్యాలపై విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం అధ్యాపక సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ ఉపాధ్యాయులుగా మీ భాధ్యత. వారికి నైతిక విలువలు నేర్పడంతో పాటు, స్నేహపూర్వకంగా మెలగాలని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మీ పరిశీలనలో ఉన్న విద్యార్థుల పట్ల ప్రేమ, అభిమానం, వాత్సల్యం చూపాలని హితవు పలికారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య సృహృద్భావ వాతావరణం ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై కఠిన చర్యలకు పాల్పడినా, హింసించినా, వేధించినా అటువంటి ఉపాధ్యాయులపై తగిన చర్యలకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. హర్యానా విద్యార్థుల విషయంలో జరిగిన ఘటన, అనంతరం ఫిర్యాదుపై వారం రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.దుర్గాప్రసాద్, జిల్లా బాలల విభాగం అధికారులు కె.జయలక్ష్మి, యాళ్ల నాగరాజు, వెన్నెల సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య ప్రదర్శనలో జిల్లాకు 11 పతకాలు

- విద్యార్థులకు ఉపాధ్యాయుల అభినందన



వేపాడ: నైపుణ్య ప్రదర్శనలో పాల్గొన్న జిల్లా విద్యార్థులు

వేపాడ: గుంటూరు జిల్లా పొన్నూరు మండలం గొల్లమూడిపాడులో నిర్వహించిన నైపుణ్య ప్రదర్శనలో జిల్లా తరఫున హాజరైన 22 మంది ప్రతిభ కనబర్చి 11 పతాకాలు సాధించినట్లు సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం బీపీఏ రాజు తెలిపారు. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగిన నైపుణ్య ప్రదర్శనలో సోంపురం పాఠశాల నుంచి జిల్లా తరఫున ముగ్గురు విద్యార్థులు వి.రాజేష్, ఎస్.అజయ్, బి.చైతన్య వెళ్లారని చెప్పారు. వీరు ఫస్ట్ ఎయిడ్, గాడ్జెట్స్, గ్లోబల్ వార్మింగ్ కల్చరల్ హెరిటేజ్, వాతావరణ మార్పులు, మార్చ్‌పాస్ట్ తదితర అంశాలపై జిల్లా బృందంతో కలిసి నైపుణ్యం ప్రదర్శించి పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. ఎస్కార్ట్ టీచర్స్ ఎ.కనకలక్ష్మి, నాగేశ్వరావుల మార్గదర్శకత్వంలో విశేష ప్రతిభ కనబరచడంపై విద్యార్థులను ప్రశంసించారు.

యువకుడి అదృశ్యం



అదృశ్యమైన యువకుడు ధనుంజయ

కొత్తవలస: ఎల్.కోట మండలం రేగ పంచాయతీ శివారు పెదిరెడ్ల పాలెం గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ చదువుతున్న లెంక ధనుంజయ (20) అదృశ్యం కావడంతో ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ సంఘటనపై సీఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం సమీపంలో గల మహారాజా ఇంజినీరింగ్ కళాశాలలో ధనుంజయ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రోజూ స్వగ్రామం నుంచి కొత్తవలస వరకు వచ్చి కళాశాలకు చెందిన బస్సులో నిత్యం రాకపోకలు సాగించేవాడు. కాగా గత నెల 29వ తేదీన ఇంటి నుంచి బయల్దేరి కొత్తవలస జంక్షన్‌లో కళాశాల బస్సు ఎక్కి వెళ్లి తిరిగి సాయంత్రం అదే బస్సులో కొత్తవలస జంక్షన్‌లో దిగి ఇంటికి చేరలేదు. ఆ రోజు నుంచి స్నేహితులు, బంధువుల ఇళ్లవద్ద వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది.దీంతో మంగళవారం యువకుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థికి అభినందనలు



విద్యార్థికి నగదు, వాలీబాల్‌ను అందజేస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.నిఖిల్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ సీహెచ్.అమరావతి మంగళవారం తెలిపారు. ఈ మేరకు విద్యార్థి నిఖిల్‌ను మండల విద్యాశాఖ అధికారి బండారు శ్రీనివాసరావు అభినందించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థికి పోటీలకు వెళ్లేందుకు అయ్యే ఖర్చుల నిమిత్తం పీడీ అమరావతి వెయ్యి రుపాయల నగదు, వాలీబాల్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థికి పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఇమంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాటక పరిషత్ ప్రదర్శనలు

- బహుమతి ప్రదానోత్సవం చేసిన శత్రుచర్ల పరీక్షిత్ రాజు



బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద ఉన్న శ్రీసత్యకైలాష్ పాఠశాల ఆవరణలో మూడు రోజుల పాటు జరిగిన ఉభయ రాష్ట్రాల నాటక పోటీలు మంగళవారం అర్ధరాత్రి ముగిశాయి. మూడు రోజుల పాటు 9 నాటక పోటీలు జరగగా వారిలో ఉత్తమ టీంలను ఎంపిక చేసి బహుమతి ప్రదానోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు హాజరై పోటీలో పాల్గొన్న ప్రతి టీమ్‌కు రూ.15వేలు బహుమతిగా అందజేశారు. ఉత్తమ ప్రదర్శనగా విశాఖవారి 'నిశ్శబ్దమా నీఖరీదెంత? 'ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా కరీంనగర్ వారి చీకటిపువ్వు, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా కొత్తపరిమళం నాటిక ఎంపికయ్యాయి. అలాగే సంకల్పం నాటికలో పాత్రధారి సీతామహలక్ష్మి, పనికిరానివాడు నాటికలో వై భవాని, కొత్తపరిమళం నాటికలో ఎం.పోలినాయుడికి జ్యూరీ అవార్డులు దక్కాయి. ఈ కార్యక్రమాన్ని నడిపించిన మేరంగి నాటకపోటీ అధ్యక్షుడు రౌతు వాసుదేవరావు, రౌతు విజయకుమార్, అజయ్‌కుమార్, బలగ వెంకటరమణ, వాన నారాయణరావు, మరడాన కిశోర్, దాసరి రాజేంద్రలకు నాటక పోటీలలో పాల్గొన్న పాత్రధారులు అభినందనలు తెలిపారు.

బైక్‌ను లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



సీతానగరం: సంఘటనాస్థలంలో యజ్జల బుజ్జి మృతదేహం



శృంగవరపుకోట: అచ్చియ్యమ్మ మృతదేహం

సీతానగరం: మండలంలోని రాష్ట్రరహదారిపై మరిపివలస సమీపంలో మంగళవారం మోటారుసైకిల్‌ను లారీ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెదభోగిలి గ్రామానికి చెందిన వై.బుజ్జి, బాలరాజులు సీతానగరం నుంచి మోటార్‌సైకిల్‌పై కొమరాడ గ్రామానికి వెళ్తుండగా మరిపివలస దగ్గర ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బుజ్జి అక్కడికక్కడే మృతిచెందగా బా లరాజుకు బలమైన గాయాలయ్యాయి. బాలరాజు కుటుంబీకులు అందించిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఏస్సై శ్రీనివాసరావు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఇద్దరు కుమార్తెలు గరుగుబిల్లి, కొమరాడ ప్రభుత్వ బాలికల విద్యాలయాల్లో అభ్యసిస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి..



సవరపు పైడయ్య మృతదేహం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలంలోని పెద బొండపల్లి గ్రామంలో గల తామర చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం రూరల్ ఎస్సై సింహాచలం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన సవరపు పైడయ్య (64) స్నానానికి చెరువులో దిగి నీరు ఎక్కువగా ఉండడం వల్ల లోతు అంచనా వేయలేక మునిగిపోయినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. మంగళవారం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని వెలికితీశామని ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని మహిళ..

శృంగవరపుకోట: మండలంలోని తెన్నుబొడ్డవర పంచాయతీ పరిధిలోని భవానీనగర్‌లో లారీ ఢీకొని ఓ మహిళ దుర్మరణం చెందింది. వివరాలిలా ఉన్నాయి. దొడ్డి తాతారావు, భార్య అచ్చియ్యమ్మ భవానీనగర్‌లో ఉంటూ అరటిపండ్ల వ్యాపారంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. మంగళవారం ఉదయం అచ్చియ్యమ్మ (57) బయటికి వెళ్లొస్తానని భర్తకు చెప్పి బయటకు వచ్చి భవానీనగర్ జంక్షన్‌లో విశాఖ-అరకు రోడ్డు దాటుతున్న సమయంలో బొడ్డవర నుంచి ఎస్.కోట వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆమె తలకు తీవ్రగాయాల పాలై ఘటనా స్థలంలోనే ప్రాణాలు వదిలింది. స్థానికులు తాతారావుకు విషయం చెప్పడంతో పరుగున వచ్చి రోడ్డుపై విగతజీవిగా పడి ఉన్న భార్యను చూసి నోటమాటరాక ఖిన్నుడయ్యాడు. సమాచారం మేరకు ఎస్.కోట ఎస్సై లోవరాజు వచ్చి, పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించి, కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదం జరగగానే లారీ డ్రైవర్, క్లీనర్లు పరారు కావడంతో పోలీసులు గాలిస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడు..



ధర్మతేజను విశాఖ తరలిస్తున్న దృశ్యం

బొబ్బిలి: మండలంలోని పారాదికి చెందిన పేకేటి ధర్మతేజ (23) లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న ధర్మతేజ హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటున్నాడు. స్వగ్రామానికి ఇటీవలే వచ్చి మంగళవారం బైక్ ఫైనాన్స్ కట్టేందుకు బొబ్బిలి వెళ్లాడు. తిరిగి ఇంటికి చేరుకునే క్రమంలో మెట్టవలస వద్ద లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో విశాఖ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి అన్న సురేష్, తల్లి సావిత్రి, తండ్రి రమణ ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపారు.

అమ్మ పండగ ఆరంభం





అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు. (ఇన్‌సెట్లో) పుష్పాలంకరణలో పైడితల్లి

- నేటి నుంచి నెలరోజుల పాటు జాతర
- వనంగుడి, చదురుగుడిల వద్ద పందిరిరాటతో ప్రారంభం
- అక్టోబర్ 30న తొలేళ్ల ఉత్సవం, 31న సిరిమానోత్సవం
- నేటి నుంచి అమ్మవారి మండల దీక్షలు
- అమ్మ పండగను విజయవంతం చేయండి: ఈఓ సుధారాణి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారి ఉత్సవాలకు వేళయింది. అమ్మవారి వనంగుడి, చదురుగుడి వద్ద బుధవారం నిర్వహించే పందిరరాట కార్యక్రమంతో ఉత్సవాలకు అంకురార్పణ జరగనుంది. ఉత్సవాలను ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం, దేవదాయశాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. వందలాది మంది దీక్ష ధారులు బుధవారం వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఉదయం 8 గంటలకు పైడితల్లి మండల దీక్షలు తీసుకుంటారు. దీక్షధారులకు ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి ఆధ్వర్యంలో ఉచితంగా అమ్మవారి వస్త్రాలను, మాలలను అందజేస్తారు. అనంతరం చదురుగుడి ఆవరణలో ఉదయం 9.30 గంటలకు, రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడి వద్ద 11 గంటలకు పందిరిరాట వేసి, జాతర మహోత్సవాలను ఈఓతో కలిసి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ట్రస్టుబోర్డు సభ్యులు ప్రారంభిస్తారు. మరుసటిరోజు నుంచి ఉత్సవాలు పూర్తయ్యేవరకూ ప్రతి మంగళవారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తారు. అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవదాయశాఖ ఏర్పాట్లు చేసింది. ఉత్సవ ఏర్పాట్లలో తలమునకలైంది.

నవంబర్ 15 వరకూ జాతరే

పందిరిరాటతో ప్రారంభమయ్యే పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు నవంబర్ 15వ తేదీ వరకూ నిర్వహిస్తారు. ఈ నెల 25న అర్ధమండల దీక్షలు, 30న సోమవారం తొలేళ్ల ఉత్సవం, 31న మంగళవారం సిరిమానోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించన్నారు. నవంబర్ 7న మంగళవారం పెద్దచెరువులో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో వేడుకగా తెప్పోత్సవం సాగుతుంది. నవంబర్ 11న శనివారం సాయంత్రం 5.30 గంటల నుంచి రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి నుంచి వందలాది మంది పైడితల్లి దీక్షాపరుల జయజయ ధ్వానాలతో కలశ జ్యోతులు పట్టుకుని దీక్షాపరులు చదురుగుడి వరకూ భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. నవంబర్ 14న మంగళవారం చదురుగుడి వద్ద ఉయ్యాల కంబాల మహోత్సవం, మరుసటి రోజు 15న బుధవారం వనంగుడి వద్ద పూర్ణాహుతి, చండీహోమం , దీక్షాపరుల దీక్షల విరమణతో ఉత్సవాలు పూర్తవుతాయి.

పుష్పాలంకరణలో పైడితల్లి

పైడితల్లి అమ్మవారు మంగళవారం తులసీ దళాలు, పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. అనంతరం సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, నేతేటి ప్రశాంత్‌లు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధనలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ సుధారాణి పర్యవేక్షించారు.

అమ్మపండగను విజయవంతం చేయండి



పైడితల్లి జాతర మహోత్సవాలు బుధవారం చదురుగుడి, వనంగుడి వద్ద వేసే పందిరిరాట మహోత్సవాలతో ప్రారంభం కానున్నాయి. నెలరోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో ఈ ఏడాది అత్యధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారందరూ ముందుగానే నెలరోజుల్లో ఏదోఒక రోజు అమ్మను ప్రశాంతంగా దర్శనం చేసుకోవాలి. మొక్కుబడులు చెల్లించుకోవాలి. అమ్మ పండగను కనులారా చూసి ఆనందించండి.

– కె.ఎల్.సుధారాణి, కార్యనిర్వహణాధికారిణి, పైడితల్లి అమ్మవారి దేవస్థానం, విజయనగరం

కళింగాంధ్ర జానపదకథలు ఆవిష్కరణ

విజయనగరం టౌన్: అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పిల్లలు రాసిన కళింగాంధ్ర జానపదకథలు కథాసంకలనం ఆవిష్కరణ గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టీవీ.కట్టిమణి మాట్లాడుతూ జానపద కళలు దాచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దానికి విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు పాటుపడాలని కోరారు. అటువంటి దీర్ఘకాలికమైన పనిని బద్రికూర్మారావు వంటి ఉపాధ్యాయులు పూనుకుని తనవంతు కృషిచేయడం ముదావహమన్నారు.